## క్లుప్తంగా

### సివిల్స్ అభ్యర్థులకు ఉచిత అవగాహన తరగతులు

చిక్కడపల్లి: యూపీఎస్సీ వచ్చే ఏడాది నిర్వహించే సివిల్స్ పరీక్షలకు సన్నద్ధమవుతున్న అభ్యర్థులకు వారం రోజుల పాటు ఉచిత అవగాహన తరగతులను ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో నిర్వహిస్తున్నట్లు అశోక్‌నగర్‌లోని అమిగోస్ 21 సెంచరీ ఐఏఎస్ కోచింగ్ సెంటర్ నిర్వాహకులు ప్రకటించారు. ఈనెల 4న ఆదివారం ఉదయం 10 గంటలకు కోచింగ్ సెంటర్ సెమినార్‌హాల్‌లో ప్రారంభమయ్యే ఈ ఉచిత అవగాహన తరగతుల్లో ఎస్సీఈఆర్‌టీ, జీఎస్ ఆప్షనల్ ఎంపిక, న్యూస్‌పేపర్ ఎనాలిసిస్ తదితర అంశాలపై విశ్లేషణాత్మక తరగతులు నిర్వహించబడతాయన్నారు. ప్రముఖ విద్యావేత్త, వ్యక్తిత్వ వికాస నిపుణులు ఆకెళ్ళ రాఘవేంద్ర ఆధ్వర్యంలో నిర్వహించే ఈ తరగతుల్లో ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు, సీనియర్ అధ్యాపకులు, అభ్యర్థులకు సూచనలు, సలహాలను అందిస్తారన్నారు. ఉచిత రిజిస్ట్రేషన్ తదితర వివరాలకు 04035052121, 9000230735 నంబరును సంప్రదించాలన్నారు.

### గూడా రామచంద్రరావు మృతి తీరని లోటు

నల్లకుంట: ఆధ్యాత్మికత, సనాతన ధర్మానికి పెద్దపీట వేసే గూడా రామచంద్రరావు (64) అకాల మృతి తెలంగాణ బ్రాహ్మణ సమాజానికి తీరనిలోటని తెలంగాణ బ్రాహ్మణ సేవా సమితి(టీబీఎస్ఎస్) రాష్ట్ర అధ్యక్షుడు పోచంపల్లి రమణారావు అన్నారు. టీబీఎస్ఎస్ కార్యవర్గ సభ్యుడు గూడా రమచంద్రరావు శుక్రవారం తెల్లవారు జామున మృతి చెందారు. ఆయన మరణ వార్త తెలుసుకున్న రమణారావు నివాళులర్పించి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ముచ్చింతల్‌లో త్రిదండి చినజీయర్ స్వామి ఆశ్రమంలో నిర్వహించే ఆధ్యాత్మిక కార్యక్రమాలలో రామచంద్రరావు తరుచూ పాల్గొనే వారన్నారు. గూడా రఘువీర్ పండిట్, గూడా శ్రీధర్, మధుసూదన్‌రావు, అనంతరావు, వెంకటేశ్వరరావు, టీబీఎస్ఎస్ ప్రతినిధులు పాల్గొన్నారు.

### డిగ్రీ అతిథి అధ్యాపకులను రెన్యూవల్ చేయాలని వినతి



మంత్రి సబితారెడ్డికి వినతిపత్రం అందజేత

ముషీరాబాద్: డిగ్రీ అతిథి అధ్యాపకులను రెన్యూవల్ చేయాలని కోరుతూ నిరుద్యోగ జేఏసీ చైర్మన్ నీలవెంకటేష్ ఆధ్వర్యంలో శుక్రవారం విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. రాష్ట్రంలో 132 డిగ్రీ కాలేజీల్లో 1940 మంది అతిథి అధ్యాపకులు పని చేస్తున్నారని గతేడాది త్రిసభ్య కమిటీ ద్వారా ఎన్నికైన వారికి 2023–24 అకాడమిక్‌కు రెన్యూవల్ చేయాలని కోరారు.

### కలుషిత నీటి సరఫరాను అరికట్టండి

అడ్డగుట్ట: కలుషిత నీటి సరఫరాతో అవస్థలు పడుతున్నామని తుకారాంగేట్ సాయినగర్‌లో ఇంటి నెం. 1–5–572 సమీపవాసులు వాపోతున్నారు. గత నెల రోజుల నుంచి కలుషిత నీరు వస్తున్నాయని తాగలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పలుమార్లు జలమండలి అధికారులకు ఫిర్యాదు చేశామని, వారు నామమాత్రంగా వచ్చి వెళ్తున్నారే కాని, సమస్యను పరిష్కరించడం లేదని వాపోతున్నారు. స్థానిక నాయకులు, అధికారులు వెంటనే సమస్యను పరిష్కరించాలని తుకారాంగేట్ సాయినగర్ వాసులు కోరుతున్నారు.

### వెయిట్ లిఫ్టింగ్‌లో రేవంత్ ప్రతిభ

సికింద్రాబాద్: ఎల్‌బీ స్టేడియంలో రెండు రోజులుగా నిర్వహించిన పవర్ లిఫ్టింగ్ పోటీల్లో సీతాఫల్‌మండికి చెందిన రేవంత్ అత్యుత్తమ ప్రతిభ కనబరిచి కాంస్య పతకాన్ని చేజిక్కించుకున్నాడు.రేవంత్ సీఎం కప్ వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో 55, క్లీన్ అండ్ జర్క్‌లో 81 కిలోలు ఎత్తి మూడవ స్థానంలో నిలిచాడు. బాలుడికి తెలంగాణ సాట్ చైర్మన్ ఆంజనేయగౌడ్ పతకాన్ని, ప్రశంసాపత్రాన్ని అందించారు. కార్యక్రమంలో కోచ్‌లు శివ, శ్రవణ్, హేమ, రాజు, వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

### చిలకలగూడ డీఐగా రుక్మిణి

చిలకలగూడ : చిలకలగూడ ఠాణా డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్‌గా పరిగి రుక్మిణి పదవీ బాధ్యతలు స్వీకరించారు. 2009 బ్యాచ్‌కు చెందిన రుక్మిణి మొదటి పోస్టింగ్ ఎస్ఆర్‌నగర్‌లో ఇచ్చారు. ఉమెన్ వింగ్, షీ టీమ్, భరోసా తదితర విభాగాల్లో పనిచేశారు. షీటీమ్‌లో పనిచేస్తున్న ఆమె బదిలీపై చిలకలగూడ డీఐగా నియమితులయ్యారు.

### డా.రామకృష్ణకు సన్మానం

ఉస్మానియా యూనివర్సిటీ: రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం తెలంగాణ అలయ్ బలయ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఓయూ అధ్యాపకులు డా.రామకృష్ణను హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ సన్మానించారు.



కాచిగూడ బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం వద్ద జాతీయ జెండాను ఎగురవేస్తున్న ఎమ్మెల్యే కాలేరు



జెండాను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ముఠాగోపాల్

# ఘనంగా తెలంగాణ అవతరణ దినోత్సవం

అంబర్‌పేట్/ ముషీరాబాద్‌జోన్ పరిధిలో తెలంగాణ దశాబ్ది ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలతో పాటు ఆసుపత్రులు, విద్యాలయాలు, పోలీస్‌స్టేషన్, వివిధ రాజకీయ పార్టీల కార్యాలయాలల్లో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. స్వరాష్ట్రం కోసం ప్రాణత్యాగం చేసిన ఉద్యమకారుల పోరాట పటిమను ఈ సందర్భంగా నాయకులు వారిని స్మరించుకున్నారు.

– అంబర్‌పేట్/ముషీరాబాద్ జోన్ బృందం



డీడీ కాలనీలో తెలంగాణ ఆవిర్భావ వేడుకల్లో మాజీ ఎంపీ వీహెచ్, కాంగ్రెస్ సీనియర్ నేతలు



సర్దార్ వల్లబాయ్ పటేల్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ



ఛే నంబరు చౌరస్తాలో బీఆర్ఎస్ ఇన్‌చార్జ్ ఎడ్ల సుధాకర్‌రెడ్డి



సోనియాగాంధీ చిత్ర పటానికి పాలాభిషేకం చేస్తున్న టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నగేష్ ముదిరాజ్



ఆవిర్భావ వేడుకల్లో సైబర్ క్రైం డీసీపీ స్నేహ మెహరా



కార్మికశాఖ కార్యాలయంలో రాష్ట్ర అదనపు కమిషనర్ డాక్టర్ ఇ.గంగాధర్



ఫీవర్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.శంకర్



బర్కత్‌పుర బీజేపీ నగర కార్యాలయ ఆవరణలో డాక్టర్ ఎన్.గౌతంరావు



బాగ్‌అంబర్‌పేటలో కార్పొరేటర్ పద్మావెంకట్‌రెడ్డి



అంబర్‌పేట్ మున్సిపల్‌గ్రౌండ్‌లో ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, కార్పొరేటర్లు



జెండాను ఎగురవేస్తున్న గాంధీనగర్ కార్పొరేటర్ పావనీవినయ్‌కుమార్



బద్రుకా కళాశాల డైరెక్టర్ జనరల్ ప్రొఫెసర్ అభిరామకృష్ణ



బాగ్‌లింగంపల్లిలో హౌజ్‌ఫెడ్ కార్యాలయంలో చైర్మన్ నవనీతరావు



అశోక్‌నగర్‌లో చౌరస్తాలో ఎమ్మెన్ శ్రీనివాస్



సుందరయ్యపార్కులో సలిపెల రమేష్‌రెడ్డి తదితరులు



అడిక్‌మెట్ డివిజన్‌లో జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న బీజేపీ నేతలు

## దోమలగూడ పోలీస్‌స్టేషన్ ప్రారంభం



స్టేషన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ముఠాగోపాల్, ఏసీపీ యాదగిరి తదితరులు

చిక్కడపల్లి: నగరంలో పోలీస్‌స్టేషన్‌ల పునర్వ్యవస్థీకరణ కార్యక్రమంలో భాగంగా నూతనంగా ఏర్పడ్డ దోమలగూడ నూతన పోలీస్‌స్టేషన్‌ను ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్, చిక్కడపల్లి ఏసీపీ ఎ.యాదగిరి, ఇన్‌స్పెక్టర్ డి.శ్రీనివాస్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా శుక్రవారం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్రం ఏర్పడిన తర్వాత నేరాలు అరికట్టేందుకు సీఎం కేసీఆర్ తీసుకొచ్చిన ఫ్రెండ్లీ పోలీసింగ్ విధానం మంచి ఫలితాలను ఇస్తుందన్నారు. దోమలగూడ సీఐ దొంతిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి పదవీబాధ్యతలు స్వీకరించగా.. శ్రీనివాస్‌రెడ్డికి ఎమ్మెల్యే ముఠా గోపాల్ ఏసీపీ యాదగిరికి శుభకాంక్షలు తెలిపారు. చిక్కడపల్లి, ముషీరాబాద్ పీఎస్‌ల సీఐలు ఎన్.సంజయ్‌కుమార్, జహంగీర్‌యాదవ్, ఎస్సైలు చెన్ను శ్రీనివాస్‌రెడ్డి, కర్నె శ్రీనివాస్‌రెడ్డి, శ్రీకాంత్‌గౌడ్, ఎన్.సాయికృష్ణ, గిరిశ్రీకాంత్, బీఆర్ఎస్ నేత ముఠాజైసింహా, మాజీ కార్పొరేటర్‌లు ముఠాపద్మానరేష్, మాచర్లపద్మజ, బీఆర్ఎస్ నేతలు ముఠా నరేష్, ఎర్రం శ్రీనివాస్‌గుప్తా, సుధాకర్, గడ్డమీది శ్రీనివాస్ పాశం రవి, రవిశంకర్ గుప్తా, బత్తుల కిరణ్‌కుమార్, స్టేషన్ నూతన సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## గానసభలో కవి సమ్మేళనం



కవులను సన్మానిస్తున్న పెద్దూరి వెంకటదాసు, రఘుశ్రీ, జనార్దనమూర్తిలు

చిక్కడపల్లి: తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది సంబరాల్లో భాగంగా త్యాగరాయగానసభ ఆధ్వర్యంలో కళాలలిత కళావేదికలో కవి సమ్మేళనం జరిగింది. శుక్రవారం ప్రముఖ కవులు పెద్దూరి వెంకటదాసు, రఘుశ్రీల నిర్వహణలో సుమారు 30 మంది కవులు స్వీయ కవితాగానంలో తెలంగాణ రాష్ట్ర ప్రశస్తిని అభివర్ణించారు. అనంతరం జరిగిన సభా కార్యక్రమంలో గానసభ అధ్యక్షుడు కళా జనార్దనమూర్తి మాట్లాడుతూ.. తెలంగాణ ఆవిర్భావ వేడుకల్లో గానసభ భాగస్వామ్యం కావాలనే ఉద్దేశంతో ఉద్యమంలో కవులపాత్రను గుర్తించి కవిసమ్మేళనం నిర్వహించామన్నారు. తెలుగువారంతా ఒక్కటిగా దేశ ప్రగతికి దోహదం చేయాలన్నారు. కవులు పాల్గొనడం ఆనందంగా ఉందని గ్రంథ ఆవిష్కరణ, కవులకు సహకరిస్తామని తెలిపారు. కవి చిక్కరామదాసు, వెంకటదాసు, రఘుశ్రీలు మాట్లాడుతూ.. రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది వేడుకల్లో గానసభ కవులకు ప్రాధాన్యతనిచ్చి సత్కరించడం అభినందనీయమన్నారు.

### క్రైస్తవ ఉద్యమకారులకు ఎమ్మెల్సీ కేటాయించాలి

నాంపల్లి: దశాబ్ది తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా శుక్రవారం గన్‌పార్కు వద్ద తెలంగాణ అమరవీరులకు దళిత క్రైస్తవ ఎస్సీ రిజర్వేషన్ సాధన సమితి అధ్యక్షులు నాగళ్ళ పోచయ్య ఇశ్రాయేల్, క్రైస్తవ ధర్మ ప్రచార పరిరక్షణ సమితి అధ్యక్షులు జెరుషలేము మత్తయ్య హాజరై నివాళులర్పించారు. ఈ సందర్భంగా జెరుషలేము మత్తయ్య మాట్లాడుతూ... తెలంగాణ క్రైస్తవ ఉద్యమకారులకు ఎమ్మెల్సీ సీటు కేటాయించాలని కోరారు. అలాగే క్రిస్టియన్ కార్పొరేషన్ చైర్మన్, డైరెక్టర్ల పదవులను భర్తీ చేసి తెలంగాణ క్రైస్తవ పోరాట యోధులను గుర్తించాలని ఆశాభావం వ్యక్తం చేశారు.

### బీజేపీ సీనియర్ నేతను పరామర్శించిన కేంద్రమంత్రి



బీజేపీ నేత మల్లేష్‌ను పరామర్శిస్తున్న కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి

అంబర్‌పేట: అనారోగ్యానికి గురైన బీజేపీ సీనియర్ నాయకులను కేంద్రమంత్రి ప్రత్యేకంగా పరామర్శించి వారిలో ఆత్మస్థైర్యాన్ని నింపారు. వారి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. శుక్రవారం బాగ్‌అంబర్‌పేట్‌లో నివసించే పార్టీ సీనియర్ నాయకులు మల్లేష్ మోకాలుకు చికిత్స కావడంతో విషయం తెలుసుకున్న కేంద్రమంత్రి ఆయనను పరామర్శించారు. అనారోగ్యానికి గురైన మరో సీనియర్ నాయకులు మనయ్య, పత్తి అనిల్ ఆరోగ్యంపై ఆరా తీశారు. బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షులు డాక్టర్ ఎస్.గౌతంరావు, గద్వాల జిల్లా ఇన్‌చార్జ్ వెంకట్‌రెడ్డి, కార్పొరేటర్ పద్మావెంకట్‌రెడ్డి, చుక్కా జగన్, గోవర్ధన్‌రెడ్డి, నాగభూషణంచారి తదితరులున్నారు.

## ‘ఉద్యమకారులను విస్మరించిన రాష్ట్ర ప్రభుత్వం’



1969 తెలంగాణ ఉద్యమ విద్యార్థి జేఏసీ కన్వీనర్ ఎస్.గోపాల్‌రావు

కాచిగూడ: సీఎం కేసీఆర్ నేతృత్వంలోని బీఆర్ఎస్ ప్రభుత్వం తెలంగాణ ఉద్యమకారులను పూర్తిగా విస్మరించిందని 1969 తెలంగాణ ఉద్యమ విద్యార్థి జేఏసీ కన్వీనర్ ఎస్.గోపాల్‌రావు ఆరోపించారు. శుక్రవారం కాచిగూడ, నింబోలిఅడ్డలోని కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. 1969 తెలంగాణ ఉద్యమకారులను గుర్తించాలని సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్‌ను కలిసి ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా.. ఏమాత్రం పటించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించారన్నారు. ‘తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకల సందర్భంగా నిర్వహిస్తున్న దశాబ్ది ఉత్సవాల్లో తెలంగాణ ఉద్యమకారులను గౌరవించి సత్కరించాలని సీఎం కేసీఆర్ ఆదేశించడం ఇది కేవలం వచ్చే అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని చేసిందే తప్పా.. ఉద్యమకారులపై సీఎం కేసీఆర్‌కు ఏమాత్రం గౌరవం లేదన్నారు’. ఈనెల 22న నిర్వహిస్తున్న తెలంగాణ ఉద్యమకారుల సన్మాన కార్యక్రమాన్ని పూర్తిగా బహిష్కరిస్తున్నట్లు ఆయన ప్రకటించారు.

- 1969 తెలంగాణ ఉద్యమంలో పాల్గొని రాజమండ్రి సెంట్రల్ జైల్లో ఉన్న వారిలో కేవలం 11 మంది మాత్రమే ప్రస్తుతం బ్రతికి ఉన్నారని వారికి ఇప్పటి వరకు ప్రభుత్వం నుంచి ఎలాంటి సహాయ సహకారులు, కనీసం గుర్తింపు కూడా లభించలేదన్నారు.
- రాష్ట్ర ప్రభుత్వం కేవలం ఓట్ల కోసమే ఉద్యమకారుల సన్మాన కార్యక్రమాన్ని పెట్టిందని, దీనిని తాము పూర్తిగా బహిష్కరిస్తున్నట్లు స్పష్టం చేశారు. తెలంగాణ ఉద్యమకారులు ప్రస్తుతం వృద్ధాప్యంలో అనేక కష్టాలు ఎదుర్కొంటున్నారని ఆరోగ్య సమస్యలతో సతమతమవుతున్నా కనీసం ఏమాత్రం పట్టించుకోలేని స్థితిలో ప్రభుత్వం ఉందన్నారు. ‘కేసీఆర్ కల్లబొల్లి మాటలను నమ్మే స్థితిలో ప్రస్తుతం తెలంగాణ ప్రజలు లేరని, వచ్చే ఎన్నికల్లో ఉద్యమకారులను విస్మరించిన కేసీఆర్‌కు ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని ఆయన హెచ్చరించారు’.

## దంత సంరక్షణపై అవగాహన అవసరం



దంత పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ ఎం. దనేశ్వరి

నల్లకుంట: దంత సంరక్షణపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని దత్తసాయి మల్టీస్పెషాలిటీ డెంటల్ ఆసుపత్రి ఎండీ డాక్టర్ ఎంఎస్ రంగారెడ్డి పేర్కొన్నారు. చిన్నారుల దంత సమస్యలపై నిర్లక్ష్యం చేయవద్దని తల్లిదండ్రులకు సూచించారు. తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా శుక్రవారం నల్లకుంట ఫీవర్ ఆసుపత్రి చౌరస్తా సమీపంలోని దత్త సాయి మల్టీ స్పెషాలిటీ డెంటల్ ఆసుపత్రిలో ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించారు. ఆసుపత్రి ఇన్‌చార్జ్ డాక్టర్ ఎం.దనేశ్వరితో కలిసి శిబిరాన్ని ప్రారంభించిన డాక్టర్ రంగారెడ్డి మాట్లాడారు. నల్లకుంట, రామంతాపూర్, నాగోల్, దిల్‌సుఖ్‌నగర్‌లలో ఏర్పాటు చేసిన దంత వైద్యశిబిరాలను ఏర్పాటు చేశామన్నారు. 150 మందికి పైగా దంత పరీక్షలు చేయించుకున్నారని అవసరమైన వారికి ఉచితంగా టూత్ పేస్టులు అందజేశామన్నారు.

## నర్స్ మర్డర్ కేసులో నిందితుడికి 2 రోజుల పోలీస్ కస్టడీ

సీన్ రీకన్‌స్ట్రక్షన్ చేయనున్న చైతన్యపురి పోలీసులు

చైతన్యపురి: డబ్బు లావాదేవీల నేపథ్యంలో దారుణ హత్యకు గురైన నర్సు అనురాధ కేసు మలక్‌పేట పోలీసు స్టేషన్ నుంచి చైతన్యపురి పీఎస్‌కు బదిలీ చేసిన విషయం తెలిసిందే. నిందితుడు చంద్రమౌళి ఆమెను అత్యంత దారుణంగా హతమార్చి తల మలక్‌పేటలో పడేసి, మిగిలిన శరీర భాగాలను తన ఇంట్లోనే ఫ్రిజ్‌లో దాచిపెట్టాడు. కాగా, చైతన్యపురి పోలీస్ స్టేషన్ పరిధిలో ఘటన జరిగినప్పటికీ తల మలక్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని తీగలగూడలో లభ్యం కావటంతో ముందుగా కేసు అక్కడ నమోదైంది. చంద్రమౌళిని అరెస్ట్ చేసి మలక్‌పేట పోలీసులు అతడిని రిమాండ్‌కు తరలించారు. ఆ తర్వాత తదుపరి విచారణ నిమిత్తం కేసును చైతన్యపురి స్టేషన్‌కు కేసు బదిలీ చేశారు. నిందితుడిని వారం రోజుల పాటు పోలీసు కస్టడీకి ఇవ్వాలని కోరుతూ కోర్టులో పిటీషన్ వేయగా శని, ఆదివారాలు రెండు రోజుల కస్టడీకి అనుమతి ఇచ్చింది. ఈ నేపథ్యంలో నిందితుడిని నేర స్థలానికి తీసుకెళ్లి సీన్ రీకన్‌స్ట్రక్షన్ చేస్తామని చైతన్యపురి ఇన్‌స్పెక్టర్ మధుసూదన్ తెలిపారు.

### తప్పించుకు తిరుగుతున్న నిందితుడి అరెస్ట్

చైతన్యపురి: చీటింగ్ కేసులో కోర్టుకు హాజరు కాకుండా తప్పించుకుని తిరుగుతున్న ఓ నిందితుడిని చైతన్యపురి పోలీసులు అరెస్ట్ చేశారు. ఇన్‌స్పెక్టర్ మధుసూదన్ తెలిపిన వివరాల ప్రకారం.. ప్రైవేట్ చిట్టీల పేరుతో పలువురిని మోసం చేసిన మెట్టు విజయ్‌కుమార్, జె.శ్రీనివాసరెడ్డిలపై బాధితుల ఫిర్యాదు మేరకు 2018లో చైతన్యపురి పోలీసులు కేసు నమోదు చేసి ఇద్దరినీ రిమాండ్‌కు తరలించారు. అయితే బెయిల్‌పై బయటకు వచ్చిన ఇద్దరూ కోర్టుకు హాజరు కాకపోవడంతో కోర్టు వారిపై నాన్‌బెయిలబుల్ వారంట్ జారీ చేసింది. కాగా, వీరిలో విజయకుమార్ చిక్కడంతో శుక్రవారం అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచామని ఇన్‌స్పెక్టర్ తెలిపారు.



### రేపు లింగాయత్ మహాసభ

చార్మినార్: తెలంగాణలో లింగాయత్‌ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 4న చలో లింగాయత్ మహార్యాలీ నిర్వహిస్తున్నట్లు లింగాయత్ సమన్వయ సమితి సెంట్రల్ కమిటీ అధికార ప్రతినిధి కె.మల్లికార్జునప్ప తెలిపారు. ఆదివారం ఉదయం ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో లింగాయత్ మహాసభ నిర్వహిస్తున్నామని అనంతరం మధ్యాహ్నం ఎగ్జిబిషన్ గ్రౌండ్స్ నుంచి ట్యాంక్ బండ్ వరకు లింగాయత్ మహార్యాలీ నిర్వహిస్తున్నామని తెలిపారు. తమకు మద్దతుగా ఏపీ, కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు తదితర రాష్ట్రాల నుంచి లింగాయత్‌లు పెద్ద ఎత్తున నగరానికి తరలి వస్తున్నారన్నారు. లింగాయత్ ఫైనాన్స్ కార్పొరేషన్ ఏర్పాటుతో పాటు ఓబీసీ జాబితాలో చేర్చాలని గత కొంత కాలంగా తాము ప్రభుత్వాన్ని కోరుతున్నామన్నారు.

### ముస్లింల సంక్షేమానికి కృషి

చార్మినార్: తెలంగాణలో అన్ని వర్గాల ప్రజల సంక్షేమంతో పాటు ముస్లిం ప్రజల సంక్షేమం జోరుగా జరుగుతోందని బీఆర్ఎస్ పార్టీ చార్మినార్ నియోజక వర్గం ఇంచార్జి మహ్మద్ సలావుద్దీన్ లోధీ అన్నారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకుని చారిత్రాత్మకమైన చార్మినార్ కట్టడం వద్ద పార్టీ ఆధ్వర్యంలో జరిగిన సంబరాలలో భాగంగా ఆయన జాతీయ పతాకావిష్కరణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు కాకముందు అతి తక్కువ ముస్లిం రెసిడెన్షియల్ పాఠశాలలు మాత్రమే కొనసాగాయని..ప్రస్తుతం తమ ప్రభుత్వ హయాంలో వందన మైనార్టీ రెసిడెన్సియల్ పాఠశాలలు నడుస్తున్నాయన్నారు. షాదీ ముబారక్‌తో పాటు పలు సంక్షేమ పథకాలు అమలు జరుగుతున్నాయన్నారు. రవీశ్వర్,మొఘల్‌పురా పుష్పాల రాధాకృష్ణలతో పాటు నాయకులు మహ్మద్ ఆమేర్,ఎస్.రమేష్, మహ్మద్ రషీద్,విజయ్‌కుమార్,నీరజ,కృష్ణ,మల్లిక్ తదితరులు పాల్గొన్నారు.

## గుడిమల్కాపూర్ నూతన పోలీస్‌స్టేషన్ ప్రారంభం

అబిడ్స్: గుడిమల్కాపూర్ నూతన పోలీస్‌స్టేషన్‌ను ఇన్‌స్పెక్టర్ ఎం.రవి ప్రారంభించారు. టప్పాచబుత్ర, ఆసిఫ్‌నగర్, కుల్సుంపురా, లంగర్‌హౌస్ పోలీస్‌స్టేషన్ల ప్రాంతాల నుంచి కొంత కొంత భాగాన్ని విడదీసి గుడిమల్కాపూర్ నూతన పోలీస్‌స్టేషన్‌గా రూపొందించారు. ఈ సందర్భంగా పలు బస్తీల వారు, అసోసియేషన్ల వారు ఇన్‌స్పెక్టర్ రవిని ఘనంగా సత్కరించారు.